# పెన్ పవర్

తెలంగాణ రౌండప్

మంగళవారం | 1 జూలై 2025 | పేజీలు 8


## హైదరాబాదీలకు మంత్రి పొన్నం గుడ్ న్యూస్..

# ఇక నుంచి కొత్త కాలనీలకు ఆర్టీసీ బస్సులు






**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాదీ లకు రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గుడ్ న్యూస్ చెప్పారు. హైదరాబాద్?లో ఇప్పటి వరకు బస్ సర్వీస్ అందుబాటులో లేని కొత్త కాలనీలకు ఆర్టీసీ సేవలు విస్తరిస్తామన్నారు. అలాగే, ఓఆర్ఆర్ లోపల కొత్త రూట్లు ఏర్పాటు చేసి ప్రయాణికుల సౌకర్యార్థం బస్సుల సంఖ్య పెంచుతామని తెలిపారు. సోమవారం (జూన్ 30) ముషీరాబాద్ ఆర్టీసీ డిపోను మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. అధునాతన టెక్నాలజీ ద్వారా ఆర్టీసీ అమలు చేస్తున్న డిజిటల్

-2 లో



## ప్రజావాణి దరఖాస్తులు...

# తక్షణమే పరిష్కరించాలి



ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మను, అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి..

- మేడ్చల్ జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి..
- అదనపు కలెక్టర్‌లతో కలిసి కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించారు..
- పలు శాఖలకి సంబంధించి మొత్తం 97 ఆర్జీలను స్వీకరించామని పేర్కొన్నారు..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జూన్ 30:** మేడ్చల్ జిల్లా నలుమూల నుండి వచ్చిన ప్రజల నుండి స్వీకరించిన వినతులను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన పాల్గొన్నారు.. జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వద్ద నుండి అదనపు కలెక్టర్‌లు రాధికా గుప్తా, విజయేందర్ రెడ్డిలతో కలిసి కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించారు.. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ ప్రజావాణిలో ఇందిరమ్మ ఇండ్ల, రెవెన్యూ, భూ భారతి, మున్సిపాలిటీలు, వివిధ రకాల ఫించన్లు, ల్యాండ్ అండ్ సర్వే, శిశు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, జిల్లా కో-ఆపరేటివ్ శాఖ, కరెంట్, ఇతర శాఖల సంబంధించి మొత్తం 97 ఆర్జీలను స్వీకరించామని తెలిపారు.. సంబంధిత దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.. అర్జీలను ఆయా శాఖల అధికారులకు, ఎండార్స్‌మెంట్ చేసి అందజేశామని, సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు సమర్పించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, పెండింగ్ లేకుండా తక్షణమే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.. ప్రజావాణి నిర్వహణ ప్రధాన ఉద్దేశమే ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కారం చేయడమేనని కలెక్టర్ మను వివరించారు.. తిరస్కరణకు గురైన దరఖాస్తులపై రిమార్కులు వ్రాయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ ప్రజావాణిలో ఆర్‌డిఓ హరిప్రియ, డిఇఓ విజయకుమారి, డియం సివిల్ సప్లయ్ అధికారి సుగుణబాయి, గృహనిర్మాణ శాఖ పిడి రమణమూర్తి, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు..



## వారి మౌనం అంగీకారంగా

# భావించవద్దు

### బీజేపీపై రాజాసింగ్ సంచలన ట్వీట్



- కొందరు మౌనంగా ఉన్నంత మాత్రాన అంగీకారం కాదన్న రాజాసింగ్
- కార్యకర్తలు, ఓటర్లు తీవ్ర నిరాశలో ఉన్నారని వెల్లడి
- వారి తరపునే తాను మాట్లాడుతున్నానని స్పష్టం

**హైదరాబాద్ పెన్ పవర్:** గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ భారతీయ జనతా పార్టీకి రాజీనామా చేసిన అనంతరం 'ఎక్స్' వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ బీజేపీ నూతన అధ్యక్షుడిగా ఒక పేరు ప్రచారంలోకి రావడంతో రాజాసింగ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ పార్టీకి రాజీనామా చేశారు. ఆయన తన రాజీనామా లేఖను

-2 లో

## పేలింది రియాక్టర్ కాదు..

# ఎయిర్ డ్రయర్ ప్రెజర్ వల్లే యాక్సిడెంట్

### కార్మికశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి



**హైదరాబాద్ పెన్ పవర్:** సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి కెమికల్ ఫ్యాక్టరీలో ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో మృతుల సంఖ్య 12 కు చేరింది. 26 మంది గాయపడ్డట్లు సమాచారం. ఈ క్రమంలో ఘటనా స్థలిని పరిశీలించిన కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రమాదం రియాక్టర్ పేలుడు వల్ల జరగలేదని.. ఎయిర్ డ్రయర్ ప్రెజర్ వల్లే జరిగిందని స్పష్టం చేశారు. ఈ ఘటనపై రాజకీయం చేయద్దని అన్నారు మంత్రి వివేక్ వెంకటస్వామి. ఘటన జరిగిన తర్వాత 15 నిమిషాల్లోనే కలెక్టర్, ఎస్పీ ఇక్కడకు చేరుకొని సహాయక చర్యలు చేపట్టారని అన్నారు.

-2 లో

# పేలింది రియాక్టర్ కాదు..ఎయిర్ డ్రయర్ ప్రెజర్ వల్లే యాక్సిడెంట్

- మొదటి పేజీ తరువాయి


ఆదికారులంతా వెంటనే అప్రమత్తమై క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారని అన్నారు. 12 మంది పరిస్థితి విషమంగా ఉందని.. మెరుగైన చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు మంత్రి వివేక్. మిగతా 22 మందికి స్వల్ప గాయాలున్నాయని.. వారు త్వరగా కోలుకుంటారని అధికారులు తెలిపారని వెల్లడించారు. ఇప్పటిదాకా 12 మంది మృతి చెందారని.. వృద్ధాలు క్లియర్ చేశాక మృతులకు సంబంధించిన కరెక్ట్ నంబర్ తెలుస్తుందని అన్నారు. ఎయిర్ డ్రైయర్ ప్రెజర్ వల్లే ప్రమాదం జరిగిందని స్పష్టం చేశారు .ఘటనకు కారణాలేంటన్నది పరిశీలిస్తున్నామని.. విచారణ జరిపి ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు మంత్రి వివేక్. ఫ్యాక్టరీ యాజమాన్యంతో మాట్లాడి కార్మికులకు అందాల్సిన ఎక్స్ గ్రేషియా అందిస్తామని.. ప్రభుత్వం తరపున కూడా చేయగలిగినంత చేసి కార్మికులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు మంత్రి వివేక్.ఘటనాస్థలిని పరిశీలించిన మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ 3 గంటలుగా రెస్క్యూ పనులను పరిశీలిస్తున్నామని.. ఘటన జరగడం బాధాకరమని అన్నారు. ఘటన జరిగిన వెంటనే ప్రభుత్వం స్పందించిందని.. ఘటనకు గల కారణాలు తెలియాల్సి ఉందని అన్నారు. ఘటన జరిగినప్పుడు 90 మంది పనిచేస్తున్నారని అన్నారు. భవనం శిథిలాల కింద ఇంకొంతమంది ఉన్నట్లు తెలుస్తోందని అన్నారు. చనిపోయినవారి వివరాలు కాసేపట్లో ప్రకటిస్తామని అన్నారు. ఘటనపై రాజకీయం చేయద్దని అన్నారు మంత్రి దామోదర రాజనర్సింహ.

## వారి మౌనం అంగీకారంగా భావించవద్దు

- మొదటి పేజీ తరువాయి

పార్టీ అధ్యక్షుడు కిషన్ రెడ్డికి అందజేశారు.అనంతరం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ, చాలామంది మౌనంగా ఉన్నంత మాత్రాన దానిని అంగీకారంగా భావించవద్దని పేర్కొన్నారు. "నేను నా ఒక్కడి గురించే మాట్లాడటం లేదు. మనల్ని నమ్మి, మన వెంట నిలిచిన లెక్కలేనంత మంది కార్యకర్తలు, ఓటర్ల తరఫున మాట్లాడుతున్నాను. వారంతా ఈరోజు తీవ్ర నిరాశకు గురయ్యారు" అని రాజాసింగ్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. నమ్మకంతో పార్టీ వెంట నడిచిన కార్యకర్తలు, మద్దతుదారులు ప్రస్తుతం తీవ్ర నిరాశలో ఉన్నారని ఆయన అభిప్రాయపడ్డారు.తనను పార్టీ అధ్యక్ష పదవికి నామినేషన్ వేయనివ్వలేదని అందుకే తాను పార్టీకి రాజీనామా చేస్తున్నానని రాజాసింగ్ అంతకుముందు వెల్లడించారు. తన మద్దతుదారులను బెదిరించారని అన్నారు. బీజేపీ గెలవకూడదనే వాళ్లు పార్టీలో ఎక్కువయ్యారని అన్నారు. పార్టీ పదవుల్లో 'నా వాడు, నీ వాడు' అంటూ నియమించుకుంటూ వెళితే పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లుతుందని హెచ్చరించారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలంటే ఎన్నిక నిర్వహించాలని డిమాండ్ చేశారు.

## హైదరాబాద్‌లో ఫుల్లు వాన.. ఈ ఏరియాలకు వెళ్తే ట్రాఫిక్‌తో చుక్కలే..!





**హైదరాబాద్ పెన్ పవర్:** భాగ్య నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. హైదరాబాద్‌లో ఈరోజు ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంది. సోమవారం సాయంత్రం నుంచి మాదాపూర్, హైటెక్ సిటీ, గచ్చిబౌలి, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్?లో మోస్తారు వర్షం కురుస్తోంది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిసర ప్రాంతాల్లో భారీగా వర్షం కురిసింది. గాలితో కూడిన వర్షం పడింది. మియాపూర్, చందానగర్, లింగంపల్లి, గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్, రాయదుర్గం ప్రాంతాల్లో వర్షం కురిసింది. మాసబ్ ట్యాంక్, మెహదీపట్నం పరిసర ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది.ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తుండటంతో వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. దాదాపు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులకు ఛాన్స్ ఉందని ఐఎండీ తెలిపింది. ఈదురుగాలులు వీచే అవకాశం ఉండటంతో పాత భవనాలు, చెట్ల కింద ఉండొద్దని వాతావరణ శాఖ అధికారులు సూచించారు. ఒక్కసారిగా నగరంలో పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తుండటంతో ట్రాఫిక్ జామ్, వాహనదారుల అవస్థలు పడ్డారు. రాత్రి 8.30 గంటల తర్వాత వర్షం తగ్గు ముఖం పట్టే అవకాశం ఉందని.. అయితే అర్ధరాత్రి వరకూ వాతావరణం ముసురు పట్టి ఉంటుందని తెలిపింది.


## హైదరాబాదీలకు మంత్రి పొన్నం గుడ్ న్యూస్.. ఇక నుంచి కొత్త కాలనీలకు ఆర్టీసీ బస్సులు

- మొదటి పేజీ తరువాయి

పేమెంట్స్ అమలు తీరును ఆయన పరిశీలించారు.ఐటీం ద్వారా ఆర్టీసీలో డిజిటల్ పేమెంట్స్, ప్రయాణికుల వివరాలు, హెడ్ ఆఫీస్ కనెక్టివిటీ తదితర సాంకేతికత గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీలో అధునాతన సంస్కరణలు తీసుకువస్తున్నామని చెప్పారు. ఆర్టీసీ బస్సుల్లో డిజిటల్ పేమెంట్స్ వ్యవస్థ తీసుకు వస్తున్నామని తెలిపారు. ఇప్పటికే తెలంగాణ వ్యాప్తంగా ఆరు వేల బస్సుల్లో డిజిటల్ పేమెంట్ వ్యవస్థ అమల్లోకి తెచ్చామని.. దాని డేటా మొత్తం హెడ్ ఆఫీస్?లో వెంటవెంటనే అప్డేట్ వస్తుందన్నారు. ఢిల్లీ మాదిరిగా తెలంగాణలో కూడా తెలంగాణ లో ఈవీ పాలసీ తీసుకొచ్చామన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణలో ఈవీ వాహనాలు అమ్మకం జరుగుతుందని తెలిపారు. చాలా కాలం తర్వాత ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఈవీ, సీఎన్జీ, ఎల్పీజీ ఆటోలకు పర్మిషన్లు ఇచ్చామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ పథకం వాహన సారథిలో గత 10 సంవత్సరాలుగా తెలంగాణలో లేదని.. మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ స్కీమ్ ఇంప్లిమెంట్ చేస్తున్నామన్నారు.

## వామ్మో.. ఇలా చంపేస్తున్నారేంటి..? మొగుడి కళ్లలో కారం కొట్టి.. పీక మీద కాలేసి తొక్కి చంపేసిన భార్య..!






**హైదరాబాద్ పెన్ పవర్:** కర్ణాటకలో ఒక మహిళ దారుణానికి ఒడిగట్టింది. కట్టుకున్న భర్త కళ్లలో కారం కొట్టి.. పీక మీద కాలేసి తొక్కి అత్యంత దారుణంగా హతమార్చింది. జూన్ 24న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కర్ణాటకలోని తుమకూరు జిల్లా తిప్టూరు తాలూకాలోని కడశెట్టి హళ్లి గ్రామంలో ఈ ఘటన జరిగింది. సుమంగళ అనే మహిళ, 50 ఏళ్ల వయసున్న శంకరమూర్తి భార్యాభర్తలు.

శంకర మూర్తి ఒక ఫాం హౌస్‌కు కాపలాగా ఉంటూ అక్కడే ఒంటరిగా ఒక గదిలో ఉంటున్నాడు. అతని భార్య సుమంగళ తిప్టూరులోని కల్పతరు గర్ల్స్ హాస్టల్?లో వంట మనిషిగా పనిచేస్తూ అదే హాస్టల్?లో ఉండేది. చెరో పని చేసుకుంటూ కుదిరినప్పుడు ఇంటికెళుతూ భార్యాభర్త జీవనం సాగిస్తున్నారు. అయితే.. హాస్టల్?లో ఉంటూ వంట మనిషిగా పనిచేస్తున్న క్రమంలో సుమంగళకు నాగరాజు అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం కాస్తా వివాహేతర సంబంధానికి దారి తీసింది.కొన్ని నెలలుగా ఈ ఇద్దరూ సుమంగళ భర్తకు తెలియకుండా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నారు. అయితే.. ఇటీవల సుమంగళ ప్రవర్తనపై ఆమె భర్త శంకరమూర్తికి అనుమానమొచ్చింది. ఈ అనుమానం కారణంగా ఎక్కడ తమ వివాహేతర సంబంధం గుట్టు రట్టవుతుందోనన్న భయంతో కట్టుకున్న భర్తను చంపేయాలని సుమంగళ నిర్ణయించుకుంది. తన ప్రియుడు నాగరాజుకు ఈ విషయం చెప్పగా ఇద్దరూ కలిసి శంకరమూర్తికి మర్డర్ స్కెచేశారు. జూన్ 24న శంకరమూర్తి కళ్లలో కారం కొట్టి.. గొంతు మీద కాలేసి తొక్కి సుమంగళ అతి కిరాతకంగా తన భర్తను హత్య చేసింది.సుమంగళ, ఆమె ప్రియుడు కలిసి శంకర మూర్తి డెడ్ బాడీని ఒక గోనె సంచిలోకి నెట్టేసి హత్య చేసిన ప్రాంతం నుంచి 30 కిలోమీటర్ల అవతలకు తీసుకెళ్లి ఒక పొలంలోని బావిలో మృతదేహాన్ని పడేశారు. తొలుత శంకరమూర్తి మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. శంకరమూర్తి బెడ్?పై కారం మరకలు కనిపించడంతో ఇదేదో వేరే వ్యవహారమని డిసైడ్ అయి ఆ కోణంలో విచారణ చేశారు. శంకరమూర్తి భార్య సుమంగళను పోలీసులు తమదైన శైలిలో విచారించి, ఆమె కాల్ డీటైల్స్ రికార్డ్స్?ను పరిశీలించాక హత్య చేశారని పోలీసులకు అర్థమైంది.సుమంగళను నిలదీయగా తానే తన భర్తను కళ్లలో కారం కొట్టి చంపేశానని ఒప్పుకుంది. నోనవినకెరె పోలీస్ స్టేషన్?లో సుమంగళపై, ఆమె ప్రియుడిపై హత్య కేసు నమోదు చేసి ఇద్దరినీ పోలీసులు అరెస్ట్ చేశారు. మేఘాలయ హనీమూన్?లో రఘువంశీ హత్య, గద్వాల సర్వేయర్ తేజేశ్వర్ హత్యతో పెళ్లంటేనే ఉలిక్కిపడే పరిస్థితులున్న తరుణంలో శంకరమూర్తి హత్య ఘటన యువతలో పెళ్లిపై అనాసక్తిని మరింత పెంచింది.

## హైదరాబాద్ బాలానగర్‌లో ఘోరం...



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్‌లోని బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వేకువ జామున 3 గంటల సమయంలో అతి వేగంతో ఉషా ఫ్యాన్ కంపెనీ ముందు ఉన్న స్తంభాన్ని కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో.. కారులో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తుల్లో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మృతి చెందిన వ్యక్తిని ముస్తాక్(19) అనే యువకుడిగా పోలీసులు గుర్తించారు.

స్తంభాన్ని కారు ఢీ కొట్టిన వెంటనే ఆ వేగానికి కారులో నుంచి ఒక వ్యక్తి రోడ్డు మీదకొచ్చి పడ్డాడు. దీంతో.. అతను స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. కారులో ఉన్న ఇద్దరికీ మాత్రం బాగా దెబ్బలు తగిలాయి. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మద్యం సేవించి కారు నడిపి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ సమయంలో కారులో ఎక్కడ నుంచి వస్తున్నారు..? నలుగురూ కలిసి ఎక్కడికి వెళుతున్నారు..? ఈ ప్రశ్నలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.మేడ్చల్ జిల్లా కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని కీసర ఆన్ టీ వద్ద కూడా ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆర్టీసీ బస్, బైక్ ఢీ కొన్న ఘటనలో బైక్ డ్రైవ్ చేస్తున్న యువకుడు మృతి చెందగా, వెనుక కూర్చున్న మరొకరికి గాయాలయ్యాయి. చనిపోయిన యువకుడిని కల్యాణ్ అని, గాయాలు అయిన తరుణ్.. బీబీ నగర్ మండలం జియాపల్లి వాసిగా పోలీసులు గుర్తించారు. ఘటనా స్థలానికి చేరుకున్న కీసర పోలీసులు మృత దేహాన్ని గాంధీ హాస్పిటల్?కు తరలించారు. చికిత్స నిమిత్తం తరుణ్?ను హైదరాబాద్ సిటీలోని హాస్పిటల్?కు తరలించారు.

## వాహనదారులకు బిగ్ అలర్ట్.. హైదరాబాద్‌లో 3 రోజులు ఈ రూట్లు బంద్..!

**హైదరాబాద్ పెన్ పవర్:** వాహనదారులకు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కీలక సూచనలు చేశారు. బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవం నేపథ్యంలో నగరంలో పలు చోట్ల ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ట్రాఫిక్ అడ్వైజరీ జారీ చేశారు. 2025 జూన్ 30 నుంచి 2025 జూలై 2 వరకు బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణం మహోత్సవ వేడుకలు జరగనున్నాయని.. ఈ మూడు రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని వెల్లడించారు. కల్యాణోత్సవం (జూలై 1), రథోత్సవం (జూలై 2) కారణంగా బల్కంపేట ఎల్లమ్మ ఆలయం దగ్గర భారీ ట్రాఫిక్ ఉంటుందన్న అంచనాల మేరకు ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టినట్లు తెలిపారు.

**ట్రాఫిక్ మళ్లింపులు:**

గ్రీన్‌ల్యాండ్స్/సత్యం థియేటర్ ఫతేనగర్: SR నగర్ టీ జంక్షన్ వద్ద మళ్లించబడింది

ఫతేనగర్ ఫ్లైఓవర్ బల్కంపేటకు: న్యూ బ్రిడ్జి వద్ద కాటమైసమ్మ ఆలయం–బేగంపేటకు మళ్లించబడింది

గ్రీన్‌ల్యాండ్స్–ఫుడ్ వరల్డ్ బల్కంపేటకు: ఫుడ్ వరల్డ్ X రోడ్డు వద్ద సత్యం థియేటర్/ SR నగర్‌కు మళ్లించబడింది


బేగంపేట నుండి బాల్కంపేటకు: గ్రీన్‌ల్యాండ్స్–సత్యం థియేటర్–SR నగర్ T Jnకు మళ్లించబడింది

SRనగర్ T Jn నుండి ఫతేనగర్‌కు బై–లేన్‌లు మూసివేయబడ్డాయి.

పార్కింగ్: R&B కార్యాలయం, GHMC మైదానం, పద్మశ్రీ–నేచర్ క్యూర్, ఫతేనగర్ అండర్ బ్రిడ్జి, నేచర్ క్యూర్ హాస్పిటల్ రోడ్డు పక్కన.

# కన్నుల పండువగా జగన్నాథ రథయాత్ర

## హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించిన రాజ్ కుమార్ రెడ్డి





**నారాయణపేట పెన్ పవర్ జూన్ 30:** హరేరామ హరికృష్ణ మందిరం ఆధ్వర్యంలో నారాయణపేట పట్టణంలోని శ్రీ బాలాజీ దేవాలయం వద్ద సోమవారం శ్రీ పూరి జగన్నాథ్ స్వామి రథయాత్ర మహోత్సవాన్ని భక్తుల జయజయధ్వానాల మధ్య ఘనంగా నిర్వహించారు. రథయాత్ర మహోత్సవానికి భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్ కుమార్ రెడ్డి.. ఫౌండేషన్ సభ్యులతో కలిసి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జరిగిన రథయాత్రలో పాల్గొని రథాన్ని లాగారు. రథయాత్ర మహోత్సవం సందర్భంగా రథయాత్ర జరుగుతున్న ప్రాంతాన్ని భక్తులతో కలిసి ఊడ్చి భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో భక్తిభావాన్ని నింపేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు గడ్డం తిప్పన్న, మధుసూదన్ రెడ్డి, గోపాల్ గౌడ్, హన్మంతు ముదిరాజ్, నర్సింహనాయుడు, మిస్కిన్ సంతోష్, నందుకుమార్, నాగురావు, చామకూర నగేష్, వై.సంతోష్, అశోక్, నిర్వాహకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# మాన్సూరాబాద్ అనిత నగర్‌లో మార్నింగ్ వాక్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే






**ఎల్బీనగర్ పెన్ పవర్ జూన్ 30:** ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మాన్సూరా బాద్ డివిజన్ పరిధిలోని అనిత నగర్‌లో నిర్వహించిన మార్నింగ్ వాక్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో ముచ్చటించి వారి సమస్యలు తెలుసుకున్నారు. కాలనీవాసులు మాట్లాడుతూ, కాలనీలోని పార్కులు నిర్మాణంలో ఉండగా, వాటిని ఆధునికంగా అభివృద్ధి చేయాలని కోరారు. ముఖ్యంగా ఒక పార్కు కాంపౌండ్ వాల్ పూర్తిగా కూలిపోయిందని, వెంటనే దాన్ని పునర్నిర్మించాలని వినతించారు. అదేవిధంగా కాలనీలోని పాత బీటీ రోడ్ల స్థానంలో నూతన బ్లాక్ టాప్ రోడ్లు వేయాలని కోరారు. వర్షకాలంలో ఇళ్లలోకి వరద నీరు ప్రవేశిస్తున్నందున, ఔట్‌లెట్లకు తగిన ప్రణాళికలు లేకపోవడమే కారణమని నివాసితులు వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, "కాలనీలోని పార్కులను ఆధునికంగా తీర్చిదిద్దుతాం. రోడ్ల నిర్మాణం విషయానికైతే సంబంధిత అధికారులతో చర్చించి పనులు చేపడతాం. వర్షపు నీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేస్తాం," అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, మాజీ అధ్యక్షులు పోచబోయిన జగదీష్ యాదవ్, టంగుటూరి నాగరాజు, యువ నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి, కాలనీవాసులు భాస్కర్ చారి, బాబూరావు, కృష్ణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో రానున్న మూడు రోజులు వర్షాలు..

## ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ..



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది వాతావరణ శాఖ. పశ్చిమ నైరుతి దిశల నుంచి వీస్తున్న గాలుల కారణంగా ఇవాళ ( జూన్ 30 ) జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఇవాళ రాష్ట్రవ్యాప్తంగా గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని.. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది వాతావరణ శాఖ.భారీ వర్షాల నేపథ్యంలో జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది వాతావరణ శాఖ. రేపటినుండి ( జులై 1 ) రాష్ట్ర వ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది వాతావరణ శాఖ.వచ్చే మూడు నాలుగు రోజుల పాటు మేఘావృతమైన వాతావరణం కొనసాగే అవకాశం ఉందని.. జూలై మొదటి వారంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది వాతావరణ శాఖ.వచ్చే వారంలో ఋతుపవనాలు చురుగ్గా కదిలే అవకాశం ఉందని తెలిపింది వాతావరణ శాఖ. దీని ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. భారీ వర్షాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. సూచించింది వాతావరణ శాఖ.

## సిగాచి కెమికల్ పరిశ్రమలో ప్రమాదం..
## 14 శాతం కుప్పకూలిన స్టాక్..

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా పాసమైలారంలోని ఫేజ్-1 ప్రాంతంలో ఉన్న సిగాచి ఇండస్ట్రీ యూనిట్ లో పెద్ద ప్రమాదం చోటుచేసుకుంది. వాస్తవానికి పరిశ్రమలోని ఎయిర్ డ్రయ్యర్ లో అధిక పీడనం వల్ల జరిగిన పేలుడులో దాదాపు 12 మంది మరణించారు. దాదాపు 40 మంది గాయాలపాలయ్యారు. అయితే ప్రమాద సమయంలో లోపలే చిక్కుకున్న కార్మికుల కోసం రెస్క్యూ బృందాలు ఆపరేషన్ కొనసాగిస్తున్నాయి. మరోపక్క అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారు. మృతుల బంధువులకు 2 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా, గాయపడిన వారికి 50 వేల రూపాయల పరిహారాన్ని ప్రకటించారు.ఈ వార్త బయటకు రావటంతో ఒక్కసారిగా సిగాచి ఇండస్ట్రీస్ కంపెనీ షేర్లు ఇంట్రాడేలో 14 శాతం మేర కుప్పకూలాయి. సాయంత్రం మార్కెట్ల ముగింపు సమయంలో స్టాక్ ఒక్కోటి రూ.48.95 రేటు వద్ద స్థిరపడ్డాయి. అయితే ప్రమాదానికి ముందు కంపెనీ షేర్లు ఇంట్రాడేలో అత్యధికంగా ఒక్కోటి రూ.56.03ని తాకాయి. అలాగే కంపెనీ షేర్ల 52 వారాల గరిష్ఠ ధర రూ.70కి దగ్గరగా ఉంది. పస్తుతం ప్రమాదంలో గాయపడిన వ్యక్తులకు అత్యుత్తమ వైద్య సేవలను అందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఘటనా స్థలానికి కార్మిక మంత్రి వివేక్ స్వయంగా వెళ్లి ప్రమాదానికి గల కారణాలు, సహాయక చర్యలను పర్యవేక్షించారు. అలాగే ప్రమాదంలో శిథిలాల కింద చిక్కుకున్న కార్మికులను కాపాడేందుకు చర్యలు కొనసాగుతున్నాయి. ఉదయం 9:37 గంటలకు అగ్ని ప్రమాద హెచ్చరిక అందింది, దీనితో పటాన్‌చెరు, సంగారెడ్డి, కూకట్‌పల్లి, మాదాపూర్, జీడిమెట్ల , రాజేంద్రనగర్ స్టేషన్ల నుంచి 11 అగ్నిమాపక వాహనాలు రంగంలోకి దిగి మంటలను అదుపుచేసే పనిలో నిమగ్నమయ్యాయి.

**కంపెనీ వ్యాపారం..**

1989లో స్థాపించబడిన సిగాచి ఇండస్ట్రీస్, మైక్రో క్రిస్టలైన్ సెల్యులోజ్ పౌడర్ ప్రధాన ఉత్పత్తి, పంపిణీదారుల్లో ఒకటిగా ఉంది. ఈ కంపెనీకి ప్రస్తుతం హైదరాబాద్, గుజరాత్‌లలో రెండు అత్యాధునిక ఉత్పత్తి ఫ్యాక్టరీలు ఉన్నాయి. సిగాచి ఇండస్ట్రీస్ ఫార్మా ఎక్సిపియెంట్స్ న్యూట్రా, ఆహార పదార్థాల రంగంలో కూడా అగ్రగామిగా ఉంది.

# ఒక్కసారి బీపీ డౌన్.. ఈ వెంటనే గుండెపోటు: నటి జరివాలా మృతి వెనక షాకింగ్ విషయాలు..!



**హైదరాబాద్ పెన్ పవర్:** బాలీవుడ్ యాక్టర్ షెఫాలీ జరివాలా గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. చిన్న వయస్సులోనే జరివాలా కార్డియాక్ అరెస్ట్‌తో ప్రాణాలు కోల్పోవడం ఇండస్ట్రీని దిగ్భ్రాంతికి గురి చేసింది. అకస్మాత్తుగా రక్తపోటు తగ్గడం వల్లే జరివాలా గుండెపోటుతో మరణించినట్లు డాక్టర్లు నిర్ధారించారు. షెఫాలీ మృతితో మరోసారి ఆకస్మిక గుండె పోటు, హైపోటెన్షన్ గురించి చర్చ మొదలైంది. అసలు ఒక్కసారిగా రక్తపోటు ఎందుకు తగ్గుతోంది..? బీపీ సడెన్?గా తగ్గితే వెంటనే గుండెపోటు వస్తుందా..? బీసీ ఒక్కసారిగా తగ్గినా.. పెరిగినా కష్టమేనా అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.
ఈ ప్రశ్నలకు పూణేలోని రూబీ హాల్ క్లినిక్‌లో కార్డియాలజిస్ట్ డాక్టర్ అభిజిత్ ఖద్తారే క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశారు. రక్తపోటు అకస్మాత్తుగా పడిపోయినప్పుడు త్వరగా చికిత్స చేయకపోతే ప్రాణాంతకమని ఆయన వివరించారు. హెపోటెన్షన్ కొన్నిసార్లు గుండె ఆగిపోవడానికి దారితీస్తుందని పేర్కొన్నారు. బ్లడ్ ప్రెసర్ 90/60 mm Hg కంటే తక్కువగా ఉండటం ప్రమాదకరం కానప్పటికీ.. వేగంగా రక్తపోటు తగ్గడం వల్ల మెదడు, గుండె, మూత్రపిండాలు వంటి ముఖ్యమైన అవయవాలకు ఆక్సిజన్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.ఇది త్వరగా అవయవాలు పనిచేయకుండా అడ్డుకుంటుందని.. వ్యక్తులను షాక్?లోకి తీసుకెళ్తుందన్నారు. బీపీ సడెన్?గా తగ్గడం వల్ల శరీరానికి అవసరమైన ఆక్సిజన్ అందక కార్డియాక్ అరెస్ట్ సంభవిస్తుందని తెలిపారు. సకాలంలో చికిత్స అందించకపోతే ప్రాణాలకే ప్రమాదమని చెప్పారు.

**బీపీ సడెన్?గా తగ్గడానికి కారణమేమిటి..?**

రక్తపోటు అకస్మాత్తుగా పడిపోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. వీటిలో తీవ్రమైన నిర్జలీకరణం లేదా భారీ రక్త నష్టం. ఇది శరీరంలో రక్త పరిమాణాన్ని తగ్గిస్తుంది. సెప్టిక్ షాక్, అనాఫిలాక్సిస్, తీవ్రమైన అలెర్జీ ప్రతిచర్య, హృదయ స్పందనలో హెచ్చు తగ్గులు వంటివి గుండె రక్తాన్ని పంప్ చేసే సామర్థ్యాన్ని బలహీనపరుస్తాయి. గందరగోళం, చలి, చెమటతో కూడిన చర్మం, శ్వాస తీసుకోవడంలో మార్పులు, బలహీనమైన వేగవంతమైన పల్స్, మూర్ఛపోవడం వంటివి తీవ్రమైన హైపోటెన్షన్ లక్షణాలు. ఇవన్నీ తక్షణ వైద్య సహాయం అవసరమయ్యే సంకేతాలు.
శరీరంలో అలాంటి సంకేతాలు కనిపించినప్పుడు త్వరగా వైద్యులను సంప్రదించాలి. క్రమం తప్పకుండా గుండె పరీక్షలు చేయించుకోవాలని, శారీరకంగా చురుకుగా ఉండాలని, ఆరోగ్యంగా తినాలని, ఒత్తిడి లేదా అసౌకర్యం వంటి ప్రారంభ సంకేతాలను నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. ముఖ్యంగామీ శరీరం మీకు ఏమి చెప్పడానికి ప్రయత్నిస్తుందో విస్మరించవద్దని.. ముందే జాగ్రత్త పడితే తర్వాత ప్రమాదాన్ని నివారించవచ్చని చెప్పారు.

# పాశమైలారం ఘటనపై సీఎం రేవంత్ దిగ్భ్రాంతి.. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం

- సంగారెడ్డి జిల్లా పాశమైలారంలో భారీ పేలుడు ఘటన
- సిగాచీ రసాయన పరిశ్రమలో పేలిన రియాక్టర్
- ప్రమాదంలో 8 మంది కార్మికులు దుర్మరణం
- ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విచారం, అధికారులకు ఆదేశాలు



**హైదరాబాద్ పెన్ పవర్:**సంగారెడ్డి జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. పాశమైలారం పారిశ్రామిక వాడలోని సిగాచీ రసాయన పరిశ్రమలో సోమవారం ఘోర ప్రమాదం జరిగింది. పరిశ్రమలోని రియాక్టర్ ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలిపోవడంతో ఎనిమిది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.
వివరాల్లోకి వెళితే... పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమలో రియాక్టర్ పేలడంతో పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. పేలుడు తీవ్రత ఎంత భారీగా ఉందంటే, ప్రమాద సమయంలో పనిచేస్తున్న కార్మికులు సుమారు 100 మీటర్ల దూరం వరకు ఎగిరిపడ్డారు. ఈ పెను విస్ఫోటనానికి ఉత్పత్తి విభాగం ఉన్న భవనం పూర్తిగా కుప్పకూలింది. సమీపంలోని మరో భవనానికి కూడా బీటలు వారాయి. ప్రమాదం జరిగిన వెంటనే ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ అలుముకుని భయానక వాతావరణం నెలకొంది.
ఈ దుర్ఘటనలో మొత్తం ఎనిమిది మంది కార్మికులు మృతి చెందినట్లు అధికారులు ధ్రువీకరించారు. వీరిలో ఐదుగురు ప్రమాదం జరిగిన వెంటనే ఘటనాస్థలంలోనే ప్రాణాలు కోల్పోగా, తీవ్రంగా గాయపడిన మరో ముగ్గురు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. మరికొందరు కార్మికులు గాయపడినట్లు సమాచారం.

**సీఎం రేవంత్ రెడ్డి స్పందన**

పాశమైలారం పేలుడు ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే ఆయన ఉన్నతాధికారులతో మాట్లాడారు. శిథిలాల కింద చిక్కుకున్న కార్మికులను కాపాడేందుకు అవసరమైన అన్ని సహాయక చర్యలను తక్షణమే చేపట్టాలని ఆదేశించారు. గాయపడిన వారికి సాధ్యమైనంత మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. సీఎం ఆదేశాల మేరకు అధికారులు సహాయక చర్యలను ముమ్మరం చేశారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

# మార్కెట్లో ఐపీవోల కోలాహలం.. 4 ఐపీవోలకు డబ్బు రెడీ చేస్కోండి, వివరాలివే..

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్యాపిటల్ మార్కెట్లో ఐపీవోల జోరు కొనసాగు తోంది. దాదాపు ఆరు నెలల గ్యాప్ తర్వాత తిరిగి వరుస ఐపీవోల రాక ఇన్వెస్టర్లకు ఆనందాన్ని కలిగిస్తోంది. ఈక్విటీల కంటే ఐపీవోలపై బెట్టింగ్ వేయటం ఇటీవలి కాలంలో భారీగా పెరగటంతో ఇన్వెస్టర్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ఈ మార్గాన్ని ప్రధానంగా ఎంచుకుంటున్నారు. ఈ క్రమంలో సెబీ వద్ద ఐపీవో పత్రాలు సమర్పించిన కంపెనీల వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం.




**ఫుడ్‌లింక్ F&B హెూల్డింగ్స్:**
కేటరింగ్, ఫుడ్ రిటైల్ చెయిన్ కంపెనీ ఫుడ్‌లింక్ F&B హెూల్డింగ్స్ (ఇండియా) తన ఐపీవోను ఫ్లోట్ చేసేందుకు సెబీకి పత్రాలు సమర్పించింది. ఈ ఐపీవో ద్వారా కంపెనీ దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి రూ.160 కోట్లను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుందని వెల్లడైంది. అయితే ఇందులో తాజా ఈక్విటీతో పాటు ఆఫర్ ఫర్ సేల్ కూడా ఉండనుంది. సమీకరించిన డబ్బును కంపెనీ కొత్త సెంట్రలైజ్డ్ కిచెన్లు, ఫుడ్‌లింక్ గ్లోబల్ రెస్టారెంట్స్ & కేటరింగ్ సర్వీసెస్ కోసం క్యాజువల్ డైనింగ్ రెస్టారెంట్లు స్టార్ట్ చేయాలని నిర్ణయించింది. ముంబై కేంద్రంగా పనిచేస్తున్న కంపెనీ మెయిన్ బోర్డ్ ఐపీవోగా రాబోతోంది.

**క్యూర్‌ఫుడ్స్ ఇండియా:**
ఇంటర్నెట్ ఆధారిత మల్టీ-బ్రాండ్ ఫుడ్ సేవల కంపెనీ క్యూర్‌ఫుడ్స్ ఇండియా లిమిటెడ్ తన ఐపీవో కోసం డ్రాఫ్ట్ పేపర్లను సెబీకి అప్పగించింది. 2024 ఆర్థిక సంవత్సరంలో ఆదాయం పరంగా ఇది రెండో అతి పెద్ద డిజిటల్ ఫస్ట్ ఫుడ్ సేవల సంస్థగా ఇది నిలిచింది. కంపెనీ తాజా ఐపీవో ద్వారా దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి రూ.800 కోట్లను సమీకరించాలని చూస్తోంది. కంపెనీ ఈ నిధులను వ్యాపార విస్తరణకు వినియోగించనుంది. ప్రస్తుతం కంపెనీ దేశవ్యాప్తంగా ఈట్‌ఫిట్, కేక్‌జోన్, ఓలియో పిజ్జా వంటి బ్రాండ్ల ద్వారా వ్యాపారాన్ని కొనసాగిస్తోంది.

**అమీర్‌చంద్ జగదీష్ కుమార్:**
బాస్మతి బియ్యం, ఎఫ్ఎంసీజీ ఉత్పత్తుల ప్రాసెసింగ్, ఎగుమతి వ్యాపారం నడుపుతున్న అమీర్‌చంద్ జగదీష్ కుమార్ (ఎక్స్‌పోర్ట్స్) లిమిటెడ్ తన ఐపీవో పత్రాలను సెబీకి సమర్పించింది. ఈ సంస్థ తాజా ఐపీవో ద్వారా దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి రూ.550 కోట్లను సమీకరించే లక్ష్యంతో ముందుకొస్తోంది. బాస్మతి బియ్యం పరిశ్రమలో సంస్థ 40 ఏళ్లకు పైగా సుదీర్ఘ ప్రస్థానాన్ని కలిగి ఉంది. ఆదాయాల పరంగా కంపెనీ మూడవ అతిపెద్ద సంస్థగా కొనసాగుతోంది. కంపెనీ తన ఉత్పత్తులను ఏరోప్లేన్ బ్రాండ్ పేరుతో మార్కెటింగ్ చేస్తోంది. అలాగే ఇతర బ్రాండ్ పేర్ల కింద ఆటా, మైదా, సుజీ, సాల్ట్ వంటి ఉత్పత్తులను కూడా విక్రయిస్తోంది.

**జునిపర్ గ్రీన్ ఎనర్జీ:**
ఇక రెన్యూవబుల్ ఎనర్జీ రంగానికి చెందిన జునిపర్ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ కూడా సెబీ వద్ద తమ ఐపీవో పేపర్స్ సబ్మిట్ చేసింది. ఈ ఇష్యూ ద్వారా కంపెనీ రూ.3వేల కోట్లు సమీకరించాలని ప్లాన్ చేస్తోంది. అయితే ఇది పూర్తిగా తాజా ఈక్విటీ ఇష్యూ కలిగి ఉండనుందని సమాచారం. కంపెనీ నిధుల్లో ఎక్కువ మొత్తాన్ని రుణ చెల్లింపులకు వినియోగించాలని నిర్ణయించింది. కంపెనీ సోలార్, విండ్ ఎనర్జీ ఉత్పత్తిలో ఉండగా సామర్థ్యం పరంగా దేశంలోని టాప్ 10 సంస్థల్లో ఒకటిగా గుర్తింపును సంపాదించుకుంది. 2025 మే 31 నాటికి మొత్తం సామర్థ్యం 7,898.45 మెగావాట్లకు చేరుకుంది.

# రైలు ప్రయాణికులకు గమనిక: అర్ధరాత్రి నుంచే కొత్త ఛార్జీల బాదుడు!




**హైదరాబాద్ పెన్ పవర్:** దేశవ్యాప్తంగా రైలు ప్రయాణికులపై ఛార్జీల భారం పడనుంది. పెంచిన రైల్వే ఛార్జీలతో పాటు టికెట్ బుకింగ్‌లో కీలక నిబంధనలను సోమవారం అర్ధరాత్రి నుంచి అమలు చేస్తున్నట్లు రైల్వే బోర్డు ప్రకటించింది. ఈ మేరకు అన్ని జోన్ల మేనేజర్లకు ఆదేశాలతో కూడిన సర్క్యులర్ జారీ చేసింది. దీని ప్రకారం జూలై 1వ తేదీ నుంచి కొత్త ఛార్జీలు, నిబంధనలు అమల్లోకి రానున్నాయి.

**ఏ క్లాస్‌కు ఎంత పెరిగిందంటే?**
రైల్వే శాఖ తాజా నిర్ణయంతో వివిధ తరగతుల్లో టికెట్ ధరలు పెరగనున్నాయి. మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో నాన్-ఏసీ ప్రయాణానికి సంబంధించి సెకండ్ క్లాస్, స్లీపర్ క్లాస్, ఫస్ట్ క్లాస్ టికెట్లపై కిలోమీటరుకు ఒక పైసా చొప్పున పెంచారు. అదేవిధంగా, అన్ని రకాల రైళ్లలోని ఏసీ తరగతుల్లో (ఏసీ చైర్ కార్, ఏసీ 3-టైర్, 2-టైర్, ఫస్ట్ క్లాస్) ప్రయాణానికి కిలోమీటరుకు రెండు పైసల చొప్పున ఛార్జీని పెంచుతున్నట్లు రైల్వే శాఖ తెలిపింది. ఆర్డినరీ రైళ్లలోని స్లీపర్, ఫస్ట్ క్లాస్ టికెట్లపై కిలోమీటరుకు అర పైసా చొప్పున ధర పెరగనుంది. అయితే, ఆర్డినరీ సెకండ్ క్లాస్‌లో ప్రయాణించే వారికి పాక్షిక ఉపశమనం కల్పించారు. 500 కిలోమీటర్ల వరకు పాత ఛార్జీలనే కొనసాగించనున్నారు. 501 నుంచి 1,500 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తే టికెట్‌పై రూ. 5, 2001 నుంచి 2500 కిలోమీటర్లకు రూ. 10, 2501 నుంచి 3000 కిలోమీటర్ల వరకు రూ. 15 అదనంగా వసూలు చేయనున్నారు.

**తత్కాల్ బుకింగ్‌కు ఆధార్ తప్పనిసరి**
ఛార్జీల పెంపుతో పాటు తత్కాల్ టికెట్ల బుకింగ్ విధానంలో రైల్వే శాఖ కీలక మార్పు చేసింది. జూలై 1 నుంచి తత్కాల్ కోటాలో టికెట్లు బుక్ చేసుకోవాలంటే ఆధార్ కార్డును తప్పనిసరి చేసింది. ఈ నిబంధనను పక్కాగా అమలు చేయాలని అధికారులకు సూచించింది. అయితే, రిజర్వేషన్ ఛార్జీలు, సూపర్‌ఫాస్ట్ సర్‌ఛార్జీలలో ఎటువంటి మార్పులు చేయలేదని రైల్వే బోర్డు స్పష్టం చేసింది. ఇప్పటికే రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులకు పాత ఛార్జీలే వర్తిస్తాయని, పెరిగిన ధరలు వారికి వర్తించవని తేల్చిచెప్పింది.

# రాజాసింగ్ వ్యాఖ్యలు.. తీవ్రంగా స్పందించిన పాయల్ శంకర్, రాణి రుద్రమ

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ బీజేపీ నూతన అధ్యక్షుడి ఎంపికపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడనుంది. మంగళవారం ఉదయం కొత్త అధ్యక్షుడి పేరును అధికారికంగా ప్రకటించనున్నట్లు పార్టీ నాయకత్వం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, అధ్యక్ష ఎన్నికల ప్రక్రియపై వస్తున్న ఆరోపణలను పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఎన్నికలు పూర్తిగా పారదర్శకంగా జరుగుతున్నాయని, ఎలాంటి వివాదాలకు తావులేదని తేల్చిచెప్పారు. తాను నామినేషన్ వేస్తానంటే అడ్డుకున్నారని ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలపై పలువురు నాయకులు స్పందించారు.

అధ్యక్ష ఎన్నిక ప్రక్రియపై ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ, పార్టీ నిబంధనల ప్రకారమే ఎన్నిక అత్యంత ప్రజాస్వామ్యబద్ధంగా సాగుతోందని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ నామినేషన్ వేసే అవకాశం కల్పించామని, 10 మంది సభ్యులు ప్రతిపాదించిన తర్వాతే నామినేషన్ స్వీకరిస్తున్నామని ఆయన వివరించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేవని, మీడియాలో వస్తున్న ఊహాగానాల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు. మంగళవారం ఉదయం హైదరాబాద్‌లోని వేద కన్వెన్షన్‌లో కొత్త అధ్యక్షుడి పేరును ప్రకటిస్తారని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి వెల్లడించారు.

మరోవైపు, అధ్యక్ష ఎన్నికల ప్రక్రియపై ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన ఆరోపణలను బీజేపీ అధికార ప్రతినిధి రాణి రుద్రమ తీవ్రంగా ఖండించారు. రాజాసింగ్ ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని, ఆయన క్రమశిక్షణ రాహిత్యం పరాకాష్టకు చేరిందని ఆమె విమర్శించారు. బీజేపీకి వ్యక్తుల కంటే పార్టీ సిద్ధాంతాలే ముఖ్యమని స్పష్టం చేశారు. రాజాసింగ్ నిజంగా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలనుకుంటే ఆ లేఖను స్పీకర్‌కు సమర్పించాలని సూచించారు. పార్టీ అధ్యక్షుడికి ఇచ్చిన రాజీనామా లేఖను జాతీయ నాయకత్వానికి పంపుతున్నట్లు రాణి రుద్రమ తెలిపారు.

# శుభవార్త.. అమెరికా నుంచి ఇండియాకు పంపే డబ్బుపై టాక్స్ 1 శాతానికి తగ్గింపు

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొన్ని వారాల కిందట అమెరికా నుంచి ఇతర దేశాలకు పంపే డబ్బుపై కూడా రెమిటెన్స్ టాక్స్ వసూలు చేయాలని నిర్ణయించారు. అయితే మ్నొదట్లో దీనిని 5 శాతంగా ఉంచాలని తాను భావిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. దీంతో అమెరికాలో ఉద్యోగ, ఉపాధి పొందుతున్న విదేశీయులు కొంత ఆందోళనకు గురైన సంగతి తెలిసిందే. గతంలో అమెరికా ఇతర దేశాలకు వ్యక్తులు పంపే డబ్బుపై ఎలాంటి పన్ను వసూలు చేయలేదని తెలిసిందే.అయితే తాజాగా అమెరికాలో నివసిస్తున్న ఎన్ఆర్ఐలకు ట్రంప్ సర్కార్ నుంచి కీలక శుభవార్త వచ్చింది. ట్రంప్ ప్రభుత్వం తీసుకొస్తున్న వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్ లో విదేశీయులు అమెరికా నుంచి తమ దేశాలకు పంపే డబ్బుపై రెమిటెన్స్ టాక్స్ ను గతంలో ప్రతిపాదించిన 5 శాతం నుంచి 1 శాతానికి తగ్గించాలని నిర్ణయించబడింది. దీనికి ముందు మే





2025లో తీసుకొచ్చిన బిల్ ప్రకారం హెచ్ 1బి, హెచ్ 2ఏ వీసాలతో నివసిస్తున్న ప్రజలు తమ స్వదేశాలకు పంపే డబ్బు, మనీ ఆర్డర్లు, ఆన్ లైన్ మనీ ట్రాన్స్ఫర్లపై 5 శాతం పన్ను కట్టాల్సిందేనని ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే తాము పంపే డబ్బుపై 5 శాతం పన్ను మరింత భారంగా ఉంటుందని చాలా మంది ఆందోళన వ్యక్తం చేస్తున్న తరుణంలో దానిని 1 శాతానికి పరిమితం చేస్తున్నట్లు శుభవార్త రావటంపై అమెరికాలోని భారతీయులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అయితే అమెరికా బ్యాంక్ ఖాతాల నుంచి చేసే చెల్లింపులు, డెబిట్ కార్డ్ చెల్లింపులు, క్రెడిట్ కార్డ్ చెల్లింపులు దీని నుంచి మినహాయింపును పొందుతాయని వెల్లడైంది. దీంతో తమ దేశాలకు డబ్బును పంపటం తక్కువ ఖర్చుతో పూర్తి చేసుకోవచ్చని అమెరికాలోని విదేశీయులు చెబుతున్నారు.ప్రధానంగా అమెరికాలో నివసిస్తున్న భారత సంతతి ప్రజలు, ఇమ్మిగ్రెంట్ కమ్యూనిటీలు గతంలో తెచ్చిన 5 శాతం పన్ను రేటును వ్యతిరేకించటాన్ని అమెరికా ప్రభుత్వం పరిగణలోకి తీసుకుందని నిపుణులు చెబుతున్నారు. భారతదేశం విషయానికి వస్తే ప్రతి ఏటా ప్రవాస భారతీయులు అమెరికాలో సంపాదించిన దాని నుంచి తమ ప్రియమైన వారికి, ఫ్యామిలీకి అక్షరాలా రూ.7 లక్షల కోట్ల వరకు పంపిస్తూ ఉంటారు. ట్రంప్ చర్యల కారణంగా ఇకపై ఇండియాకు అమెరికాలో నివసిస్తున్న భారతీయుల నుంచే వచ్చే డబ్బు తగ్గిపోతుందని అంచనా వేయబడింది. అమెరికా నుంచి పంపే ప్రతి రూ.లక్షలో రూ.వెయ్యి పన్ను రూపంలో కట్ అవనుంది.

# సంగారెడ్డి జిల్లాలో భారీ పేలుడు.. 13 మంది మృతి.. అసలేం జరిగింది?

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా పాశమైలారం ఇండస్ట్రియల్ ఏరియాలో భారీ పేలుడు సంభవించింది. ఇందులో భాగంగా... సిగాచీ కెమికల్ ఫ్యాక్టరీలో రియాక్టర్ పేలింది. దీంతో ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. ఈ ప్రమాదంలో 13 మంది మృతిచెందారు. వీరిలో ఐదుగురు ఘటనా స్థలంలో మృతి చెందగా, మరో ఎనిమిది ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు!అవును... పాశమైలారం ఇండస్ట్రియల్ ఏరియాలోని సిగాచీ కెమికల్ ఫ్యాక్టరీలో ఘోర ప్రమాదం జరిగింది. ఫ్యాక్టరీలోని రియాక్టర్ పేలుడు ధాటికి కార్మికులు సుమారు 100 మీటర్ల దూరం ఎగిరిపడ్డారని తెలుస్తోంది. మరోవైపు ప్రొడక్షన్ బిల్డింగ్ కూలిపోగా, పక్కనున్న మరో భవనానికి బీటలు వచ్చాయి. ఈ ప్రమాదంలో మొత్తం 30 మంది గాయపడగా.. వారిలో 13 మంది మృతిచెందారు.ఈ ప్రమాదంలో గాయపడిన వారిని మదీనాగూడ, చందానగర్ లోని ప్రైవేటు ఆస్పత్రులకు తరలించగా.. చికిత్స పొందుతున్న వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా స్పందించిన మదీనాగూడలోని ప్రణామ్ ఆస్పత్రి ఎండీ మనీష్ గౌర్.. తమ వద్ద 18 మంది చికిత్స పొందుతున్నారని తెలిపారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందన్నారు.

మరోవైపు సమాచారం అందిన వెంటనే 11 ఫైరింజన్లతో అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఘటనాస్థలాన్ని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోష్ పరిశీలించారు.

ఇదే సమయంలో... సంఘటనా స్థలాన్ని మంత్రి దామోదర రాజనర్సింహ పరిశీలించారు. ఈ సందర్భంగా... క్షతగాత్రులకు మెరుగైన వైద్య సాయాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. మరోవైపు మాజీ మంత్రి, బీఆరెస్స్ నేత హరీశ్ రావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.అదేవిధంగా... కెమికల్ ఫ్యాక్టరీలో మంటలతో పాటు భారీగా విషవాయువులు విడుదలవడంతో పరిసర ప్రాంతాల్లో ఘాటైన వాసనలు వ్యాపించాయి. దీంతో.. స్థానికులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఈ సమయంలో.. అప్రమత్తమైన అధికారులు సంఘటనా స్థలానికి ఎవరూ రావొద్దని హెచ్చరించారు. ఈ ఘటన రాష్ట్రాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది.





**ప్రమాదంపై సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి!:**
పాశమైలారం పారిశ్రామికవాడలో సీగాచి ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలి 10 మంది మృతి చెందిన ఘటనతో రాష్ట్రం ఒక్కసారిగా తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది! ఈ సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎక్స్ వేదికగా స్పందించారు. పాశ మైలారం, పారిశ్రామిక వాడ, అగ్ని ప్రమాద ఘటనలో పలువురు మరణించడం దిగ్భ్రాంతి కలిగించిందని తెలిపారు.ఇదే సమయంలో... క్షతగాత్రులక మెరుగైన వైద్య సహాయం అందించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని అన్నారు.

**సమగ్ర దర్యాప్తు నిర్వహించాలన్న కేటీఆర్!:**
పటాన్ చెరులోని పాశమైలారం పారిశ్రామిక ప్రాంతంలో జరిగిన రియాక్టర్ పేలుడు అత్యంత విషాదకరమని మాజీ మంత్రి, బీఆరెస్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ మేరకు ఎక్స్ లో పోస్ట్ పెట్టిన ఆయన... ప్రమాద స్థలంలో చిక్కుకున్న కార్మికులను వెంటనే రక్షించాలని అధికారులను కోరుతున్నట్లు తెలిపారు. దయచేసి గాయపడిన వారందరికీ మెరుగైన వైద్య సహాయం అందేలా చూసుకోండని కోరారు.ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో తన ఆలోచనలు, ప్రార్థనలు మృతుల కుటుంబాలతో ఉన్నాయని చెప్పిన కేటీఆర్... అన్ని పారిశ్రామిక యూనిట్లకు భద్రతా ఆడిట్ లు తప్పనిసరి చేయాలని, ఈ సంఘటనపై సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# చిన్న మొత్తాల పొదుపు పథకాల వడ్డీ రేట్లు యథాతథం



**హైదరాబాద్ పెన్ పవర్:** దేశవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు పెట్టుబడులు పెట్టే చిన్న మొత్తాల పొదుపు పథకాలపై వడ్డీ రేట్లను కేంద్ర ప్రభుత్వం యథాతథంగా కొనసాగించింది. పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్), సుకన్య సమృద్ధి యోజన వంటి కీలక పథకాలకు సంబంధించి 2025-26 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికి (జులై 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు) పాత వడ్డీ రేట్లనే వర్తింపజేస్తున్నట్లు ఆర్థిక శాఖ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. వడ్డీ రేట్లను మార్చకపోవడం ఇది వరుసగా ఆరో త్రైమాసికం కావడం గమనార్హం.ఇటీవల ఆర్బీఐ రెపో రేటును తగ్గించడం, ప్రభుత్వ బాండ్లపై రాబడి కూడా క్షీణించడంతో ఈసారి చిన్న పొదుపు పథకాలపై వడ్డీ రేట్లను తగ్గిస్తారనే ప్రచారం విస్తృతంగా జరిగింది. అయితే, ఈ ఊహాగానాలకు తెరదించుతూ ప్రస్తుత రేట్లనే స్థిరంగా ఉంచేందుకే ప్రభుత్వం మొగ్గు చూపింది. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో అమల్లో ఉన్న వడ్డీ రేట్లే, జులై-సెప్టెంబర్ త్రైమాసికానికి కూడా వర్తిస్తాయని కేంద్ర ఆర్థిక శాఖ జారీ చేసిన నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది.తాజా నిర్ణయం ప్రకారం ఆడపిల్లల భవిష్యత్తు కోసం ఉద్దేశించిన సుకన్య సమృద్ధి యోజన పథకంపై అత్యధికంగా 8.2 శాతం వడ్డీ కొనసాగుతుంది. అదేవిధంగా పీపీఎఫ్, మూడేళ్ల కాలపరిమితి డిపాజిట్లపై 7.1 శాతం వడ్డీ రేటు స్థిరంగా ఉంటుంది. నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎన్ఎస్సీ)పై వడ్డీ రేటు 7.7 శాతంగా కొనసాగుతుంది.ఇతర పథకాల విషయానికొస్తే, కిసాన్ వికాస్ పత్రపై 7.5 శాతం వడ్డీ (115 నెలల మెచ్యూరిటీ) లభిస్తుంది. నెలవారీ ఆదాయ పథకంపై 7.4 శాతం, పోస్టాఫీసు సేవింగ్స్ డిపాజిట్లపై 4 శాతం వడ్డీ రేటులో ఎలాంటి మార్పులు చేయలేదు. కాగా, కేంద్ర ప్రభుత్వం ప్రతి త్రైమాసికానికి ఒకసారి ఈ చిన్న పొదుపు పథకాల వడ్డీ రేట్లను సమీక్షిస్తుంటుంది. చివరిసారిగా 2023-24 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో ఈ రేట్లను సవరించింది.

# పాశమైలారం ప్రమాదంపై గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, బండి సంజయ్ తీవ్ర దిగ్భ్రాంతి

- సంగారెడ్డి జిల్లా పాశమైలారం అగ్నిప్రమాదంపై గవర్నర్ విచారం
- ఈ దుర్ఘటన తనను తీవ్రంగా కలచివేసిందన్న గవర్నర్
- ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి
- గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష



**హైదరాబాద్ పెన్ పవర్:**సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామిక వాడలో జరిగిన పేలుడు ఘటనపై తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పారిశ్రామిక వాడలో రియాక్టర్ పేలడంతో పలువురు మృతి చెందడం పట్ల ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్‌కు ఫోన్ చేసి ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు ఆయన తన సంతాపాన్ని తెలియజేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని ప్రిన్సిపల్ సెక్రటరీని ఆదేశించారు. పాశమైలారం పారిశ్రామిక వాడలో జరిగిన ఘోర అగ్నిప్రమాదంపై కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దురదృష్టకర ఘటన తనను ఎంతగానో కలచివేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదం అత్యంత విషాదకరమని బండి సంజయ్ తన సందేశంలో పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో తమ ఆప్తులను కోల్పోయిన కుటుంబాలకు ఆయన తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ఇవ్వాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ ఘటనలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అంది, వారు త్వరితగతిన సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని ప్రార్థిస్తున్నట్లు బండి సంజయ్ వివరించారు.

# ఆయన గెలిస్తే ఒక్క డాలర్ కూడా ఇవ్వను.. న్యూయార్క్ మేయర్ అభ్యర్థిపై ట్రంప్ ఫైర్

**హైదరాబాద్ పెన్ పవర్:**అమెరికాలో అధ్యక్ష ఎన్నికల వేడి రాజుకుంటున్న వేళ, న్యూయార్క్ నగర మేయర్ ఎన్నికల చుట్టూ రాజకీయాలు తీవ్రరూపం దాల్చాయి. డెమొక్రటిక్ సోషలిస్ట్ పార్టీ తరపున మేయర్ బరిలో నిలిచిన భారత సంతతి నేత జోహ్రాన్ మమ్దానీ గెలిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. నవంబర్ 4న జరిగే ఎన్నికల్లో మమ్దానీ విజయం సాధిస్తే, న్యూయార్క్ నగరానికి అందే ఫెడరల్ నిధులను పూర్తిగా నిలిపివేస్తానని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫాక్స్ న్యూస్ ఛానెల్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ… "మమ్దానీని పక్కా కమ్యూనిస్ట్. ఒకవేళ అతను మేయర్ అయితే, నేను అధ్యక్షుడిగా ఉంటాను. అతను సరిగ్గా ప్రవర్తించాల్సి ఉంటుంది. లేదంటే న్యూయార్క్‌కు ఎలాంటి నిధులు రావు. అలాంటి వ్యక్తి న్యూయార్క్ మేయర్ కావడం నమ్మశక్యంగా లేదు. న్యూయార్క్ మేయర్‌గా ఎవరున్నా, వారు హద్దుల్లో ఉండాలి. లేదంటే ఫెడరల్ ప్రభుత్వం ఆర్థికంగా చాలా కఠినంగా వ్యవహరిస్తుంది" అని ట్రంప్ హెచ్చరించారు. కాగా, నగర గణాంకాల ప్రకారం న్యూయార్క్‌కు ఫెడరల్ ప్రభుత్వం నుంచి ఏటా సుమారు 100 బిలియన్ డాలర్లకు పైగా నిధులు అందుతున్నాయి.



ట్రంప్ ఆరోపణలను తిప్పికొట్టిన మమ్దానీ

ట్రంప్ చేసిన ఆరోపణలపై 33 ఏళ్ల జోహ్రాన్ మమ్దానీ అదే స్థాయిలో స్పందించారు. ఆదివారం పలు టీవీ చర్చా కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, ట్రంప్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఎన్బీసీ ఛానెల్ నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో మీరు కమ్యూనిస్టా? అని నేరుగా అడిగిన ప్రశ్నకు "కాదు, నేను కమ్యూనిస్ట్‌ను కాదు" అని ఆయన స్పష్టం చేశారు.

"అధ్యక్షుడు నా రూపం, నా స్వరం, నా నేపథ్యం గురించి మాట్లాడుతున్నారు. ఎందుకంటే నేను పోరాడుతున్న అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించాలని ఆయన కోరుకుంటున్నారు. ట్రంప్ ఏ శ్రామిక వర్గం కోసమైతే ప్రచారం చేసి అధికారంలోకి వచ్చారో, ఆ తర్వాత వారినే మోసం చేశారు. నేను అదే శ్రామిక వర్గం కోసం పోరాడుతున్నాను" అని మమ్దానీ తెలిపారు. న్యూయార్క్ నగరాన్ని శాంక్చుయరీ సిటీగా కొనసాగిస్తానని, తద్వారా వలసదారులు ఎలాంటి భయం లేకుండా నగర జీవితంలో భాగస్వాములు కావచ్చని ఆయన హామీ ఇచ్చారు. ఉగాండాలో జన్మించిన భారత సంతతికి చెందిన మమ్దానీ, ప్రస్తుతం రాష్ట్ర అసెంబ్లీ సభ్యుడిగా ఉన్నారు. అద్దెలు తగ్గించడం, ఉచిత డేకేర్, ఉచిత బస్సు ప్రయాణం వంటి జనరంజక హామీలతో ఆయన అనూహ్యంగా ప్రజాదరణ పొందారు. పోల్స్‌లో మాజీ గవర్నర్ ఆండ్రూ క్యూమోను వెనక్కి నెట్టి ఆయన ముందుకు దూసుకురావడం డెమొక్రటిక్ పార్టీలో ప్రకంపనలు సృష్టించింది. దీంతో ట్రంప్, ఆయన వర్గీయులు మమ్దానీని తీవ్రవాద భావజాలం ఉన్న వ్యక్తిగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు.

## పుణె హైవేపై ఘోరం.. కారులో బాలికపై లైంగిక దాడి.. మహిళల నుంచి నగలు దోపిడీ!

**హైదరాబాద్ పెన్ పవర్:**మహారాష్ట్రలో జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న వారి భద్రతపై మరోసారి ఆందోళన కలిగించే ఘటన చోటుచేసుకుంది. పుణె జిల్లాలో నడిరోడ్డుపై కారు ఆపిన కొద్దిసేపటికే దుండగులు దోపిడీకి పాల్పడి, ఓ బాలికపై లైంగిక దాడికి ఒడిగట్టారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం… పుణె జిల్లాలోని భిగ్వాన్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున 4:15 గంటల సమయంలో ఈ దారుణం జరిగింది. ఓ కారులో ముగ్గురు మహిళలు, ఓ బాలిక ప్రయాణిస్తుండగా, డ్రైవర్ కాలకృత్యాలు తీర్చుకోవడానికి వాహనాన్ని హైవే పక్కన నిలిపారు. డ్రైవర్ కారు నుంచి దిగి వెళ్లిన వెంటనే, ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు అక్కడికి చేరుకున్నారు. వారు నేరుగా కారు వద్దకు వచ్చి, లోపల ఉన్న మహిళలను పదునైన ఆయుధాలతో భయపెట్టారు. వారి ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను బలవంతంగా లాక్కున్నారు. నగలు దోచుకున్న తర్వాత దుండగుల్లో ఒకడు మరింత కిరాతకంగా ప్రవర్తించాడు. కారులోనే ఉన్న 17 ఏళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ అకస్మాత్తు పరిణామంతో బాధితులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అనంతరం దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ దారుణ ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఈ విషయంపై పుణే (రూరల్) ఎస్పీ సందీప్ సింగ్ గిల్ మాట్లాడుతూ… "ఈ ఘటనపై కేసు నమోదు చేశాం. దుండగులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించాం. నిందితుల కోసం ముమ్మరంగా గాలిస్తున్నాం" అని మీడియాకు వెల్లడించారు.

## 337 టన్నుల భోపాల్ వ్యర్థాలు దహనం: బూడిదను పాతిపెట్టేందుకు భూగర్భ గదుల నిర్మాణం!

**హైదరాబాద్ పెన్ పవర్:** దేశ చరిత్రలో పెను విషాదాన్ని మిగిల్చిన భోపాల్ గ్యాస్ దుర్ఘటనకు సంబంధించిన కీలక ప్రక్రియ ముగిసింది. యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీలో దశాబ్దాలుగా పేరుకుపోయిన అత్యంత ప్రమాదకరమైన 337 టన్నుల రసాయన వ్యర్థాలను అధికారులు ఎట్టకేలకు పూర్తిగా దహనం చేశారు. దాదాపు 40 ఏళ్ల తర్వాత ఈ వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్మూలించడంతో ఆ దుర్ఘటనకు సంబంధించిన ఒక అధ్యాయం ముగిసినట్టయింది. మధ్యప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి అధికారి ద్వివేది ఈ వివరాలను వెల్లడించారు. పీథాంపూర్‌లోని ప్రత్యేక డిస్పోజల్ ప్లాంట్‌లో ఈ వ్యర్థాల దహన ప్రక్రియను పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. మార్చి 27న హైకోర్టు జారీ చేసిన ఆదేశాల మేరకు కేంద్ర, రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డుల సాంకేతిక నిపుణుల పర్యవేక్షణలో ఈ ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా చేపట్టారు. తొలుత ప్రయోగాత్మకంగా 30 టన్నుల వ్యర్థాలను కాల్చివేయగా, మిగిలిన 307 టన్నులను మే 5 నుంచి జూన్ 30 మధ్య విజయవంతంగా దహనం చేశారు.

ఈ వ్యర్థాలను దహనం చేస్తున్న సమయంలో పర్యావరణంపై ఎలాంటి ప్రభావం పడకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని ద్వివేది స్పష్టం చేశారు. ప్లాంట్ నుంచి వెలువడే వాయువులను, కాలుష్య కణాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ యంత్రాంగం ద్వారా పర్యవేక్షించారు. పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజల ఆరోగ్యానికి ఎలాంటి హాని కలగకుండా నిర్దేశిత పరిమాణంలోనే వ్యర్థాలను కాల్చివేసినట్లు ఆయన వివరించారు. దహన ప్రక్రియ పూర్తయ్యాక మిగిలిపోయిన బూడిద, ఇతర అవశేషాలను అత్యంత సురక్షితంగా ప్రత్యేక సంచుల్లో ప్యాక్ చేసి, లీకులు లేని కంటైనర్లలో ప్లాంట్‌లోని స్టోరేజ్ షెడ్‌కు తరలించారు. ఈ బూడిదను భూమిలో శాశ్వతంగా పాతిపెట్టేందుకు ప్రత్యేకంగా ల్యాండ్‌ఫిల్ సెల్స్ (భూగర్భ గదులు) నిర్మిస్తున్నామని, నవంబర్ నాటికి నిర్మాణం పూర్తవుతుందని తెలిపారు. ప్రణాళిక ప్రకారం అంతా సజావుగా సాగితే ఈ ఏడాది డిసెంబర్ నాటికి బూడిదను శుద్ధి చేసి ఈ సెల్స్‌లో పాతిపెట్టే ప్రక్రియ కూడా పూర్తవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

1984 డిసెంబర్ 2వ తేదీ అర్ధరాత్రి భోపాల్‌లోని యూనియన్ కార్బైడ్ కర్మాగారం నుంచి మిథైల్ ఐసోసైనేట్ విషవాయువు లీకైన ఘటనలో అధికారిక లెక్కల ప్రకారం 3,787 మంది మరణించగా, 5 లక్షల మందికి పైగా తీవ్రంగా ప్రభావితమయ్యారు. ఆ దుర్ఘటన ప్రభావం తరతరాలపై పడిందని, బాధితులు నేటికీ ఆరోగ్య సమస్యలతో పోరాడుతూనే ఉన్నారని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

## రాజాసింగ్ రాజీనామా.. స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్

- బీజేపీ బీసీ వ్యతిరేకి అని మరోసారి రుజువైందన్న మంత్రి పొన్నం
- అధ్యక్ష పదవికి బీసీ నేతను అడ్డుకున్నారంటూ తీవ్ర ఆరోపణ
- రాజా సింగ్ రాజీనామాతో బీజేపీపై కాంగ్రెస్ విమర్శలు
- బీజేపీ ఒక ఫ్యూడల్ పార్టీ అని పొన్నం ఘాటు వ్యాఖ్యలు
- సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని స్పష్టీకరణ



హైదరాబాద్ పెన్ పవర్:బీజేపీ మరోసారి తన బీసీ వ్యతిరేక వైఖరిని స్పష్టంగా బయటపెట్టుకుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల నేపథ్యంలో గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ రాజీనామా చేయడంపై ఆయన స్పందిస్తూ, ఆ పార్టీని ఒక ఫ్యూడల్ పార్టీగా అభివర్ణించారు. ఈ మేరకు సోమవారం ఆయన తన 'ఎక్స్' ఖాతా ద్వారా బీజేపీపై విమర్శలు చేశారు.

**బీసీ నేతను అడ్డుకున్నారు: పొన్నం**

బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం ఒక బీసీ నాయకుడు నామినేషన్ వేయడానికి ప్రయత్నిస్తే, ఆయనను నిరంకుశంగా అడ్డుకున్నారని పొన్నం ఆరోపించారు. నామినేషన్‌కు మద్దతు తెలిపిన వారిని సైతం భయభ్రాంతులకు గురిచేయడం బీజేపీ నియంతృత్వ ధోరణికి నిదర్శనమని ఆయన అన్నారు.

"ముగ్గురు బీసీ ఎంపీలు, ఎందరో సీనియర్ నాయకులు ఉన్నప్పటికీ, బీసీలకు అధ్యక్ష పదవి ఇవ్వడానికి బీజేపీకి మనసొప్పలేదు. గతంలో బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని చెప్పి, కనీసం శాసనసభాపక్ష నేతగా కూడా అవకాశం ఇవ్వలేదు" అని పొన్నం విమర్శించారు. బీజేపీలో బీసీలకు ఎప్పటికీ న్యాయం జరగదని, ఆ పార్టీ నేతలే ఈ విషయంపై వాపోతున్నారని, దీనికి బీజేపీ అధిష్టానం ఏం సమాధానం చెబుతుందని ఆయన ప్రశ్నించారు.

సోమవారం జరిగిన బీజేపీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఎమ్మెల్యే రాజా సింగ్ తన మద్దతుదారులతో కలిసి నాంపల్లిలోని పార్టీ కార్యాలయానికి వెళ్లారు. అయితే, తన అనుచరులను బెదిరించారని, నామినేషన్ వేయకుండా అడ్డుకున్నారని ఆరోపిస్తూ ఆయన పార్టీకి తన రాజీనామాను ప్రకటించారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఆ పార్టీలోని కొందరు పెద్దలకే ఇష్టం లేదని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు.

**సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యం**

సామాజిక న్యాయం అనేది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. తమ పార్టీలో ముఖ్యమంత్రి రెడ్డి వర్గానికి చెందిన వ్యక్తి అయితే, పీసీసీ అధ్యక్షుడిగా బీసీ నేతకు అవకాశం కల్పించామని గుర్తుచేశారు. "మేము కుల గణన చేపట్టి, బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు చట్టం చేశాం. కానీ బీజేపీ మాత్రం బీసీల గొంతు కోస్తోంది" అని ఆయన విమర్శించారు. గతంలో బీసీ నేత బండి సంజయ్‌ను కీలకమైన ఎన్నికల సమయంలో అధ్యక్ష పదవి నుంచి తొలగించిన విషయాన్ని కూడా మంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు. దేశవ్యాప్తంగా రాహుల్ గాంధీ బీసీల పక్షాన నిలుస్తున్నారని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు న్యాయం చేసేది ఒక్క కాంగ్రెస్ పార్టీయేనని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# బీజేపీ అధ్యక్షుడి ఎంపిక.. ముఖ్యమంత్రి పదవిపై బండి సంజయ్ కీలక వ్యాఖ్య

- బీజేపీ ఒక ప్రజాస్వామ్య పార్టీ అని స్పష్టం చేసిన బండి సంజయ్
- అధ్యక్ష పదవికి ఎవరైనా నామినేషన్ వేయొచ్చని వెల్లడి
- అంతిమంగా అధిష్ఠానం నిర్ణయానికే కట్టుబడి ఉండాలని సూచన
- వచ్చే ఎన్నికల్లో గెలిచి తెలంగాణలో బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని హామీ
- దళితుడిని ముఖ్యమంత్రి చేస్తామని చెప్పి బీఆర్ఎస్ మోసం చేసిందని విమర్శ
- పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నికపై నెలకొన్న ఉత్కంఠ నేపథ్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీ ఒక ప్రజాస్వామ్యయుతమైన పార్టీ అని, అయితే అధ్యక్షుడి ఎంపికపై అధిష్ఠానం నిర్ణయమే అంతిమమని ఆయన స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్, నాంపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం పార్టీలో ఎవరైనా నామినేషన్ దాఖలు చేయవచ్చని, కానీ చివరకు పార్టీ అధిష్ఠానం ఎవరి పేరును ఖరారు చేస్తే వారే బాధ్యతలు స్వీకరిస్తారని బండి సంజయ్ తెలిపారు. "బీజేపీలో ఎవరో చెబితే అధ్యక్షులను నియమించరు. అధిష్ఠానం అధికారికంగా ప్రకటించేంత వరకు వేచి చూడాలి. పార్టీ కార్యకర్తలంతా అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉంటారు" అని ఆయన అన్నారు.

పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించి, వ్యతిరేకంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ కచ్చితంగా అధికారంలోకి వస్తుందని బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వస్తే బీసీలకు చెందిన వ్యక్తినే ముఖ్యమంత్రిని చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ విషయంలో బీఆర్ఎస్ పార్టీని ఆయన తీవ్రంగా విమర్శించారు.

"గతంలో దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని హామీ ఇచ్చి బీఆర్ఎస్ మాట తప్పింది. ప్రజలను మోసం చేసింది. మరి ఇప్పుడు బీసీలకు ముఖ్యమంత్రి పదవి లేదా పార్టీ అధ్యక్ష పదవి ఇస్తామని ప్రకటించే దమ్ము ఆ పార్టీకి ఉందా?" అని ఆయన సవాల్ విసిరారు.

# రేవంత్ ప్రభుత్వంపై హరీశ్ రావు తీవ్ర విమర్శలు

- గురుకులాలను నిర్లక్ష్యం చేస్తున్నారన్న హరీశ్ రావు
- 13 నెలలుగా భవనాల అద్దె చెల్లించడం లేదని మండిపాటు
- విద్యార్థులు చిరిగిన దుస్తులతో పాఠశాలలకు వస్తున్నారని ఆవేదన





హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యావ్యవస్థను, ముఖ్యంగా గురుకులాలను తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తోందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో ఆదర్శంగా నిలిచిన గురుకులాల పరిస్థితి నేడు దయనీయంగా మారిందని, ప్రభుత్వ ఉదాసీనత వల్ల లక్షలాది మంది బడుగు బలహీన వర్గాల విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి వెళ్తోందని ఆయన ట్విట్టర్ వేదికగా ఆవేదన వ్యక్తం చేశారు.

గురుకులాలకు ఆహార పదార్థాలు సరఫరా చేసే కాంట్రాక్టర్లకు ఈ ఏడాది జనవరి నుంచి బిల్లులు చెల్లించడం లేదని హరీశ్ రావు ఆరోపించారు. దీనివల్ల ఇప్పటికే కోడిగుడ్లు, మాంసం, అరటిపండ్ల సరఫరా నిలిచిపోయిందని గుర్తుచేశారు. జులై 1 నుంచి అన్ని రకాల సరఫరాలను నిలిపివేస్తామని కాంట్రాక్టర్లు హెచ్చరిస్తున్నారని, ఇది విద్యార్థుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.మరోవైపు, గత 13 నెలలుగా గురుకుల భవనాలకు సంబంధించిన అద్దె బకాయిలు పేరుకుపోయాయని హరీశ్ రావు తెలిపారు. సుమారు రూ. 450 కోట్లకు పైగా అద్దె చెల్లించకపోవడంతో, పలు ప్రాంతాల్లో భవన యజమానులు పాఠశాలలకు తాళాలు వేయడం మొదలుపెట్టారని ఆయన పేర్కొన్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే విద్యార్థులు రోడ్డున పడే ప్రమాదం ఉందని ఆయన అన్నారు.

విద్యా సంవత్సరం ప్రారంభమై చాలా రోజులు గడుస్తున్నా, విద్యార్థులకు అవసరమైన యూనిఫామ్స్, స్కూల్ బ్యాగులు, బూట్లు వంటి కనీస సౌకర్యాలను కూడా ప్రభుత్వం ఇప్పటివరకు అందించలేదని ఆయన మండిపడ్డారు. చిన్నారులు పాత, చిరిగిన దుస్తులతో పాఠశాలలకు వస్తున్న దృశ్యాలు తనను కలిచివేశాయని చెప్పారు. కేసీఆర్ హయాంలో దేశానికే ఆదర్శంగా నిలిచిన గురుకులాల వ్యవస్థ, రేవంత్ రెడ్డి పాలనలో ఇలా నిర్వీర్యం కావడం అత్యంత బాధాకరమని హరీష్ రావు వ్యాఖ్యానించారు.